




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**| విలేకరులు కావలెను |**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 262 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 12-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

### ప్రపంచమంతా అనిశ్చితి ఉన్నా

# భారత్‌లో మాత్రం స్థిరత్వం

## ప్రపంచంలోనే మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది



- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు భారత్ వేగంగా అడుగులు
- ప్రస్తుత డేటా ప్రకారం భారత ప్రగతిపై ప్రపంచవ్యాప్తంగా ఆశలు
- ద్రవ్యోల్బణం సైతం అదుపులోనే ఉంది
- వైబ్రెంట్ గుజరాత్' ప్రాంతీయ సదస్సులో ప్రధాని మోడీ

**గాంధీనగర్ : జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న సమయంలోనూ భారత్ రాజకీయ స్థిరత్వం, సుస్థిరతతో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం గుజరాత్‌లోని కచ్‌లో ఏర్పాటు చేసిన 'వైబ్రెంట్ గుజరాత్' ప్రాంతీయ సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోందన్నారు.

-మిగతా 2 లో




### ప్రపంచానికి మేడారం జాతరను

# పరిచయం చేస్తాం

- జాతర కోసం రూ.251 కోట్లు వెచ్చిస్తున్నాం
- 15 కల్లా జాతర పనులు పూర్తి
- మేడారాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు
- 18న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం

**ములుగు జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
సమ్మక్క-సారలమ్మ జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదు ఈ వేడుక తెలంగాణ గుండె చప్పుడు, ఆత్మగౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మేడారంలో జాతర పనులను మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారులను దర్శించుకున్నారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా శాశ్వత నిర్మాణాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

-మిగతా 2 లో



### ఇండియాపై

# ఉగ్ర కుట్ర.

- వేలమంది మావన బాంబర్లు సిద్ధం..
- మసూద్ అజార్ ఆడియో లీక్

**న్యూఢిల్లీ**
ఇండియాపై దాడి చేసేందుకు ఒకరిద్దరు కాదు.. వందలు కాదు.. వేల మంది మానవబాంబర్లు సిద్ధంగా ఉన్నారని పాకిస్తాన్ లోని ప్రమాదకర తీవ్రవాది మసూద్ అజార్ అన్నాడు. ఈ అంశంపై మసూద్ మాట్లాడిన మాటలకు సంబంధించిన ఆడియో రికార్డింగ్ ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ ఆడియోలో మసూద్ ఇండియాపై దాడికి సంబంధించిన అంశాల్ని పంచుకున్నాడు.ఆత్మాహుతి దాడులు చేసేందుకు ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వంద మంది కాదు.. వెయ్యి మంది కూడా కాదు.. ఎంత మంది సిద్ధంగా ఉన్నారో చెబితే ప్రపంచ మీడియా హడలిపోతుంది" అని ఆ ఆడియోలో మసూద్ మాట్లాడాడు. తమ లక్ష్యం కోసం ఆత్మ బలిదానం చేయడానికి ఇప్పటికే ఎంతోమంది సిద్ధంగా ఉన్నట్లు మసూద్ తెలిపాడు. వారంతా దండేత్తేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించాడు. అయితే, ఈ ఆడియో ఎప్పటిది అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఇది పాత ఆడియోనా.. లేక తాజాగా విడుదలైందా అనేది తేలాల్సి ఉంది. ఎందుకంటే మసూద్ అజార్ 2019 నుంచి బయట కనిపించింది లేదు. అతడు ఎక్కడున్నాడు అనే విషయంలో కూడా స్పష్టత లేదు.

-మిగతా 2 లో

# ఇప్పుడే వద్దు

## | లేనిపోని తలనొప్పులు తెచ్చుకోవద్దు |



- జూన్ తర్వాతే ఆలోచిద్దాం
- కార్పొరేషన్ పదవులపై సీఎం నిర్ణయం
- కష్టపడి పనిచేసే వారి జాబితానివ్వాలంటూ మంత్రులకు సూచన

**హైదరాబాద్ -జనవరి 11(నేటి భారత్)**
అధికార కాంగ్రెస్‌లో నేతలను ఊరిస్తూ ఊరిస్తూ వచ్చిన కార్పొరేషన్ పదవుల జాతర.. మళ్లీ వెనక్కిపోయిందా? అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. దీంతో క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతో అంటూ ఇప్పటిదాకా వేచి చూసిన ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. కార్పొరేషన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులను ఇప్పుడే భర్తీ చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ముందు జిల్లాకు ఒకరికో ఇద్దరికో ఈ పదవులనిచ్చి.. మిగతా వారిని ఎందుకు దూరం చేసుకోవాలంటూ ఆయన తన మంత్రివర్గ సహచరులతో అన్నట్టు సమాచారం. 'అసెంబ్లీ, పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల్లో జిల్లాల్లోని నేతలందరూ కలిసికట్టుగా పనిచేసి, పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఈ ఐక్యతే మనకు బలం. ఇప్పుడు కార్పొరేషన్ పదవుల

-మిగతా 2 లో

# సిరియాపై విరుచుకుపడిన అమెరికా

- ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు లక్ష్యంగా దాడులు



**డెమాస్కస్ -**
ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌ను లక్ష్యంగా చేసుకొని అమెరికా దళాలు సిరియాపై పెద్ద ఎత్తున విరుచుకుపడ్డాయి. అమెరికా సిబ్బందిపై ఐఎస్ జరిపిన దాడికి ప్రతీకారంగా గత నెలలోనే అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు ఆపరేషన్ ప్రారంభించాయి. దీనికి కొనసాగింపుగా సిరియా వ్యాప్తంగా శనివారం దాడులు జరిగాయని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఈ దాడుల కారణంగా ప్రాణనష్టం జరిగిందీ లేనిదీ ఆ ప్రకటనలో వివరించలేదు. మరిన్ని వివరాలు అందజేసేందుకు పెంటగాన్ నిరాకరించింది. కాగా ఈ ఆపరేషన్‌లో 35కు పైగా లక్ష్యాలపై దాడి చేసి 90 ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బులెట్లు వంటి యుద్ధ సామగ్రిని ప్రయోగించామని ఓ అధికారి సీబీఎస్ న్యూస్‌కు తెలియజేశారు. ఈ దాడిలో ఎఫ్-15ఈ, ఏ-10, ఏసీ-130జే, ఎంక్యూ-9, జోర్డాన్‌కు చెందిన ఎఫ్-16 సహా 20 యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. 'మేము దేనినీ మరచి పోము.

-మిగతా 2 లో

### ఎస్ఎల్‌బీసీపై ఎలా

# ముందుకెళ్దాం

- మాగ్నటిక్ సర్వేపై అధికారుల మల్లగుల్లాలు
- దారి మళ్లిస్తేనే పనులు పూర్తవుతాయనే వాదన తెరపైకి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలోనూ తర్జనభర్జన
- ఎలాగైనా పనులు ప్రారంభించాలని సర్కార్ నిర్ణయం



**హైదరాబాద్ జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) పనుల పున:ప్రారంభంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. భూమి లోపల జరిగిన మార్పుల కారణంగా సొరంగమార్గంలో ఇన్‌లెట్ 14వ కిలోమీటర్ వద్ద షియర్ జోన్(లూస్ సాయిల్) వల్ల ప్రమాదం జరిగి 2.5 కిలోమీటర్ల మేరకు పైకప్పు కుప్పకూలింది. 2025 ఫిబ్రవరి 22న జరిగిన ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. దాంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై సందేహాలు వ్యక్తమవుతున్న తరుణంలో జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) ఆధ్వర్యంలో

-మిగతా 2 లో



# నేడు పిఎస్ఎల్‌వి-సి 62 ప్రయోగం

- మొదలైన కౌంట్‌డౌన్
- మరికొన్ని గంటల్లో నిప్పులు చిమ్ముతూ నింగిలోకి
- ఉదయం 10.17 గంటలకు ఇస్రో ఈ రాకెట్‌ను ప్రయోగం

**న్యూఢిల్లీ జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
పీఎస్ఎల్‌వీ సీ-62 రాకెట్ మరికొన్ని గంటల్లో నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లనుంరది. శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు ఇస్రో ఈ రాకెట్‌ను ప్రయోగించనుంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రాకెట్ ప్రయోగానికి 24 గంటల ముందు అంటే ఆదివారం ఉదయం 10.17 గంటలకు కౌంట్‌డౌన్ కూడా మొదలైందిఈ రాకెట్ ద్వారా ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు.

-మిగతా 2 లో

### ప్రతి పేదవాడికి

# ఇందిరమ్మ ఇల్లు

## రాజకీయాలకతీతంగా అందరికీ ఇండ్లు

- రామగుండంలో 800 మెగా వాట్ల ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం
- సింగరేణిని కాపాడేందుకు ప్రణాళికలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గోదావరిఖనిలో మంత్రులు పొంగులేటి,
- శ్రీధర్‌బాబు, అడ్లూరి, సురేఖతో కలిసి రూ.175.92కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గోదావరిఖని జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కల నిజం చేస్తామని, రాజకీయాలకతీతంగా అందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 96 లక్షల కుటుంబాలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుదిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు హర్క వేణుగోపాల్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి రూ. 175.92 కోట్లతో అభివృద్ధి పనులకు

-మిగతా 2 లో

### సచివాలయంలోనే

# సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా

- మంత్రులకు తెలియకుండానే జీవోలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్ -జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) )**
రాష్ట్రంలో థియేటర్ల కంటే సచివాలయంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. ”టికెట్ ధరలు పెంచుతూ జీవో బయటికి వస్తుంది. ఆ శాఖకు బాధ్యత

-మిగతా 2 లో

ప్రపంచమంతా అనిశ్చితి ఉన్నా

# భారత్‌లో మాత్రం స్థిరత్వం

మొదటి తరువాయి



ప్రస్తుత డేటా ప్రకారం భారత ప్రగతిపై ప్రపంచవ్యాప్తంగా ఆశలు పెరిగాయని, ప్రపంచంలోనే మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని ఆయన పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం సైతం అదుపులోనే ఉందని గొప్పలు చెప్పారు. ప్రస్తుత సమయంలో మౌలిక సదుపాయాలతో పాటు, పరిశ్రమలకు సిద్ధంగా ఉన్న కార్మిక శక్తి అత్యంత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

**సోమనాథ్ శౌర్యయాత్రలో..**

గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ స్థానిక సోమనాథ్ ఆలయంలో శౌర్యయాత్రలో కూడా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన కాన్వారుని అనుసరిస్తూ 108 గుర్రాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మోడీ మాట్లాడుతూ సోమనాథ్ ఆలయ ధ్వజం మరో వెయ్యేళ్ళు రెపరెపలాడుతూనేవుంటుందని తెలిపారు.

# ఇండియాపై ఉగ్ర కుట్ర.

మొదటి తరువాయి



కాగా, మసూద్ అంతర్జాతీయ ఉగ్రవాది. అతడు 2001లో ఇండియాలోని పార్లమెంటుపై జరిగిన దాడికి, అలాగే 2008 ముంబై దాడులకు సూత్రధారి. జైషే మహ్మద్ సంస్థను నడిపిస్తున్నాడు. ఇటీవల జరిగిన పలు దాడులతో కూడా అతడికి సంబంధం ఉందని ఢిల్లీ పోలీసులు అనుమానిస్తున్నారు.

# సిరియాపై విరుచుకుపడిన అమెరికా

మొదటి తరువాయి



ఎన్నడూ పశ్చాత్తాపపడం' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్ సేథ్ చెప్పారు. గత నెల 13వ తేదీన సిరియాలోని పామిరా నగరంలో ఇద్దరు అమెరికా సైనికులను, ఓ పౌరుడిని ఐఎస్ ఉగ్రవాదులు హతమార్చారని, దానిని ప్రతీకారంగానే ఈ దాడులు చేస్తున్నామని సెంట్‌కామ్ చెబుతోంది. ప్రస్తుతం సిరియాలో వెయ్యి మంది అమెరికా సైనికులు మకాం వేశారు. 'మా సందేశం స్పష్టంగా ఉంది. మా యుద్ధ వీరులకు మీరు నష్టం కలిగిస్తే ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మిమ్మల్ని హతమారుస్తాం. తప్పించుకోవాలని ఎంతగా ప్రయత్నించినా ఫలితం ఉండదు' అని సెంట్‌కామ్ తన ప్రకటనలో ఉగ్రవాదులను హెచ్చరించింది. కాగా సిరియాలోని గ్రామీణ ప్రాంతాలలో వేర్వేరు చోట్ల అనేక పేలుళ్లు సంభవించాయని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో ద్వారా తెలుస్తోంది. భాగస్వామ్య దేశాల దళాలతో కలిసి దాడులు చేశామని సెంట్‌కామ్ తెలిపింది. అయితే ఏయే దేశాల దళాలు దాడిలో భాగస్వాములయ్యాయో వెల్లడించలేదు. దాడిలో తమ దళాలు కూడా పాల్గొన్నాయని ఆ తర్వాత జోర్డాన్ సైన్యం ప్రకటించింది. ఐఎస్ ఉగ్రవాదులపై గత నెల 19న ప్రారంభించిన ఆపరేషన్‌కు అమెరికా 'హాకీ స్ట్రైక్' అని పేరు పెట్టింది. ఆ రోజు సెంట్రల్ సిరియాలోని 70 లక్ష్యాలపై దాడి జరిగింది. అక్కడ ఐఎస్ మౌలిక సదుపాయాలు, ఆయుధాలు ఉన్నాయని అమెరికా అనుమానం. డిసెంబర్ 30న జరిపిన మరో దాడిలో పాతిక మంది ఐసిస్ ఉగ్రవాదులను పట్టుకోవడమో లేదా మట్టుపెట్టడమో చేశామని అమెరికా తెలిపింది.

# సచివాలయంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా

మొదటి తరువాయి

వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి మాత్రం ఇందులో నా ప్రమేయం లేదని అంటారు. నా దగ్గరికి ఫైల్ రాలేదు అని నిస్సహాయంగా చేతులెత్తేస్తారు. శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిది.. జీవో ఇచ్చేది ఇంకొకరు.. క్యాబినెట్ మంత్రికి తెలియకుండా ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే.. అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుపుతున్నది సర్కారా? లేక సర్కస్ కంపెనీనా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. టికెట్ల పెంపు విషయంలో హైకోర్టు మొట్టి కాయలు వేసినా ప్రభుత్వ తీరు మారలేదని విమర్శించారు. నేను ఈ సీట్లో ఉన్నంత కాలం సినిమా టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని చెప్పిన సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సినిమా రంగాన్ని పరిశ్రమగా కాకుండా, రాజకీయ కక్షలు తీర్చుకునే అడ్డాగా మార్చుతున్నారని విమర్శించారు.

# ఇప్పుడే వద్దు

మొదటి తరువాయి

పేరిట కొంతమందికే పదవులనిచ్చి, మిగతా వారిని నిరుత్సాహపరచటం సరికాదు. ఇలా చేసే ఇప్పటిదాకా ఉన్న ఐక్యత దెబ్బతింటుంది. ఇది మున్సిపల్ ఎన్నికల్లో నష్టాన్ని చేకూరుస్తుంది. అంతిమంగా పార్టీకి ఇబ్బందిని తెచ్చి పెడుతుంది. అందువల్ల ఇప్పుడప్పుడే వాటి జోలికెళ్లొద్దు. ఆ మేరకు మీరు కూడా జిల్లా నేతలను మానసికంగా సిద్ధం చేయండి' అంటూ సీఎం మంత్రులతో వ్యాఖ్యానించినట్టు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే అంకితభావంతో, కష్టపడి పనిచేసే వారి జాబితాను జిల్లాల వారీగా తనకు పంపాలంటూ ముఖ్యమంత్రి అమాత్యులకు సూచించారు. మినిస్టర్ల ప్రాధాన్యతలపై కూడా ఆయన ఇటీవల ఆరా తీసినట్టు సమాచారం. 'మీ దృష్టిలో ఉన్నవారు, ఎన్నో ఏండ్లుగా కష్టపడి, పార్టీకి సేవలందిస్తున్న వారి లిస్టును పంపండి' అని ఆయన కోరారు. ఈ జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు ప్రాధాన్యతనివ్వాలంటూ ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక డీసీసీ అధ్యక్షుడి పేరును ఈ సందర్భంగా ఒక మంత్రి.. సీఎంకు పంపినట్టు తెలిసింది. తమ జిల్లాలో పంచాయతీ



నుంచి పార్లమెంటు దాకా.. సీట్లన్నీ ఎస్టీలకు రిజర్వ్ అయి ఉన్నాయి కాబట్టి బీసీ అయిన డీసీసీ అధ్యక్షుడికి కార్పొరేషన్ పదవిని కట్టబెడితే సామాజిక సమతూల్యత పాటించినట్టు అవుతుంది, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అతడు రెట్టించిన ఉత్సాహంతో పని చేయటానికి అవకాశం ఉంటుందంటూ సదరు మంత్రి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఇలంటి అంశాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి సమాలోచనలు జరుపుతున్నారు.

**జూన్ తర్వాతే**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయ్యాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదన, అనంతరం కేంద్ర ప్రభుత్వ జనగణన, ఆ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరసగా రాబోతున్నాయి. జూన్ నాటికి గానీ ఇవన్నీ పూర్తయే అవకాశాల్లేవు. అప్పటికి రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లు పూర్తి చేసుకుంటుంది. అందువల్ల జూన్ తర్వాతే కార్పొరేషన్ పదవుల భర్తీ చేపడితే బాగుంటుందని సీఎం నిర్ణయించారు. 'తమ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేండ్లు పూర్తయిన సందర్భంగా సీనియర్లు, అంకితభావమున్న నేతలకు కార్పొరేషన్ పదవులు' అని చెప్పుకోవటానికి వీలుగా ఆయన రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

# ప్రపంచానికి మేడారం జాతరను పరిచయం చేస్తాం

మొదటి తరువాయి

జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.251 కోట్లు ఖర్చు చేస్తున్నదని, ఇందులో జాతర నిర్వహణ కోసం రూ.150 కోట్లు, శాశ్వతంగా గుడి నిర్మాణ పనులకు గాను రూ.101కోట్లు వెచ్చిస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే జాతర పనులు 85శాతం పూర్తి అయ్యాయని అన్నారు. మిగిలిన పనులు 15వ తేదీ వరకు పూర్తి అవుతాయని తెలిపారు. పూర్తి చేసిన పనులకు 24గంటల్లో బిల్లులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో అక్కడే క్యాబినెట్ సమావేశం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్టు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారానికి ఆదివారం ప్రతి గంటకు సగటున వెయ్యి వాహనాలు చేరుకున్నాయని తెలిపారు. ఐదు లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ జాతర సమయంలో తొక్కిసలాట వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మేడారం మాస్టర్ ప్లాన్‌తో దర్శన సామర్థ్యం పెంపు**

మేడారం జాతర పనుల పురోగతిపై ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు



పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్‌బాబు ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖ పనులను నిర్దిష్ట గడువులోగా అన్ని పనులు తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు. ప్రాకారం మరియు క్యూలైన్ మధ్య సుమారు 12 అడుగుల లోతు వ్యత్యాసం ఉన్న ప్రాంతాలను మట్టితో నింపి ఈ నెల 15లోపు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఈఈ మంత్రికి వివరించారు. క్యూ లైన్‌ల కోసం మొత్తం 1,086 రైలింగ్ ఫ్యాబ్రికేషన్ సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. దేవాలయ పరిసరాల్లో ల్యాండ్‌స్కేపింగ్ పనులపై జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడారు. రెండు సబ్ స్టేషన్ల నుంచి మేడారానికి విద్యుత్ సరఫరా చేస్తున్నామని, షార్ట్ సర్క్యూట్‌లు, విద్యుత్ చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. పరిశుభ్రత విషయంలో కుంభమేళాను ఉదాహరణగా తీసుకుని అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలను మేడారంలోనూ అనుసరించాలని మంత్రి ఆదేశించారు.

# ఎస్ఎల్‌బీసీపై ఎలా ముందు కెళ్దాం

మొదటి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను ఉపయోగించి హెలీబోర్న్ సాంకేతికతో మాగటిక్ సర్వేను చేసింది. నెల రోజుల్లో పూర్తవుతుందని చెప్పిన ఈ సర్వేను మూడు నెలలు ఆలస్యంగా డిసెంబర్‌లో ఎన్‌జీఆర్ఐ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. అయితే సర్వేలో వారు ప్రస్తావించిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అనుమానాలపై అధికారులు ఇంకా ఓ కొలిక్కి రాలేక పోతున్నారు. పై కప్పు కూలిన ప్రాంతంలో భూ ఉపరితలంలో భూమి పలకలు ఇంకా సంక్లిష్టంగా ఉన్నాయనీ, క్వార్ట్జ్, గ్రానైట్ రకాలకు చెందిన రెండు పలకలు భూమి ఉపరితలం నుంచి భూ గర్భంలోకి ఏటవాలుగా ఉందని సర్వేలో తేలింది. అలాగే ఆ ప్రాంతమంతా నీటి ప్రవాహాలు ఉండటంతో నీరు ఆగకుండా ఊరుతోందని సర్వేలో వెల్లడైంది. ఎక్కడైతే ప్రమాదం జరిగిందో ఆ ప్రాంతం గుండా తిరిగి నిర్మాణం చేపట్టడం సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు. ఇన్‌లెట్ 14వ కిలోమీటర్ నుంచి వెనకకు నాలుగు కిలోమీటర్ల నుంచి సొరంగాన్ని దారి మళ్లిస్తే ప్రయోజనం ఉంటుందని వారంటున్నారు. అయితే ఆ ప్రక్రియ ఇప్పట్లో తేలదని సర్కార్ ఆందోళన చెందుతోంది. సొరంగం దారి మళ్లింపు అనేది అనేక అనుమతులు, ఇతర సవాళ్లతో కూడుకున్న నేపథ్యంలో పాత మార్గంలోనే ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా ఎస్ఎల్‌బీసీ సొరంగం మొత్తం 43.931 కి.మీ. కాగా ఇన్‌లెట్ వైపు 13.936 కి.మీ. పూర్తయ్యింది. ఔట్‌లెట్ వైపు 20.435 కి.మీ. తవ్వారు. ఇంకా 9.533 కి.మీ. పూర్తిచేయాల్సి ఉంది.

**ఏమిటీ సర్వే?**

హెలికాప్టర్ మాగటిక్ సర్వే అనేది భూ భౌతిక పరిశోధనలో ఉపయోగించే అధునిక పద్ధతి. హెలికాప్టర్‌పై మాగ్నోమీటర్ అనే సెన్సర్‌ను అమర్చి భూమి లోపల జరిగే మార్పులను కొలుస్తారు. ఖనిజాలు, చమురు, గ్యాస్, భూగర్భ నిర్మాణాలను మ్యాపింగ్ చేస్తారు. తెలగాణ, జార్ఖండ్, చత్తీస్‌గడ్, రాజస్తాన్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఈ సర్వేలు జరిగాయి. గ్లోబల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ), ఆయిల్ అండ్ నేచర్ గ్యాస్ కంపెనీ(ఓఎన్‌జీసీ), (ఎంఈసీఎల్) వంటి సంస్థలు తరుచుగా ఖనిజాలను అన్వేషించేందుకు ఈ సర్వేలను నిర్వహిస్తాయి. సర్వే ద్వారా భూగర్భంలో 800 మీటర్ల నుంచి 1,000 మీటర్ల లోతు వరకు నిర్మాణ సంబంధమైన మార్పులను గుర్తిస్తారు. పియర్ జోన్స్, నీటి మార్గాలు, రాక్ అస్థిరతలను గుర్తిస్తారు.

# నేడు పిఎస్ఎల్‌వి-సి 62 ప్రయోగం

మొదటి తరువాయి

న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ రూపొందించిన తొమ్మిదో పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహమిది. ప్రయోగం నేపథ్యంలో ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి నారాయణన్, శాస్త్రవేత్తలు శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి ముక్కంటి, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయాల్లోనూ పూజలు చేశారు. రాకెట్, ఉపగ్రహ నమూనాలను శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేయించారు. అనంతరం ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తిరుమలలో మీడియాతో మాట్లాడారు. పీఎస్ఎల్‌వీ సీ-62 రాకెట్ ద్వారా ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నామని చెప్పారు. దేశ రక్షణ రంగానికి ఇది అత్యంత కీలకమని, ఇది 2026లో ఇస్రో చేపడుతున్న తొలి ప్రయోగమని అన్నారు. పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాల్లో ఇది 64వదని నారాయణన్ తెలిపారు. ఈ మిషన్ ద్వారా మొత్తం 8 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 442 విదేశీ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించిందని వెల్లడించారు.

# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

మొదటి తరువాయి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రామగుండం నగరంలో వివిధ డివిజన్‌లలో రూ.80 కోట్ల 52 లక్షలు, టీయూఎఫ్ఐడీ ద్వారా రూ.88 కోట్ల 90 లక్షలతో చేపట్టనున్న నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణ సరఫరా, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టనున్న రూ.6.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నగరంలో నిర్మించిన 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు, 494 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పేదల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరమే రూ.22 వేలా 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నదన్నారు. 29 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్తు , 52 లక్షల పైగా నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాలకుర్తి ఎత్తిపోతల పథకం పనులు త్వరలో చేపడతామని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కృషి మేరకు రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రామగుండం ప్రాంతంలో 10 సంవత్సరాలపాటు ఎటువంటి ప్రాజెక్టులు గత పాలకుల హయాంలో తేలేదని విమర్శించారు. సింగరేణి కార్మికులకు, జెన్ కో, డిస్కంలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించిందని, అదే రీతిలో రాష్ట్రంలో పనిచేసే ఐదు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కోటి రూపాయల బీమా ప్రభుత్వం ప్రారంభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు, జే.అరుణశ్రీ, డి.వేణు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



**హుస్నాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు, ధైర్యసాహసాలకు ప్రతీక వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలను తెలంగాణ వడ్డెర జన చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గ్రంథలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దక్షిణ భారతదేశంలో తొలి పోరాటం చేసిన వీరుడు వడ్డే ఓబన్న అని, ఆయనలాంటి యోధుల త్యాగాలతో ప్రజాస్వామ్యం బలపడిందని పేర్కొన్నారు. వడ్డెర సోదరులు సామాజిక, రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాజీ ఛైర్మన్ బోలిశెట్టి శివయ్య మాట్లాడుతూ చెరువులు, బావులు, కోటలు, అసెంబ్లీ భవనాలు వడ్డెర సోదరుల శ్రమ ఫలితమని, బ్రిటిష్ పాలకులను ఎదుర్కొన్న వీరుడు వడ్డే ఓబన్న అని అన్నారు. జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మిత్రుడిగా వడ్డే ఓబన్న పోరాటం, స్నేహం, త్యాగం లోనూ నిలిచారని గుర్తుచేశారు.ఓయూ జేఏసీ వైస్ ఛైర్మన్ గంపల శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, వడ్డెర యువత ఉన్నత చదువులు చదివి రాజకీయంగా ముందుండాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వెంకటేష్ వడ్డెర సోదరులు ఐక్యంగా ఉండి ఓబన్న ఆశయాలను కొనసాగించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వడ్డెర ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, అక్కన్నపేట వడ్డెర సంఘం అధ్యక్షుడు కుమార్, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 20న 'ఛలో ఇందిరాపార్క్ పోరు దీక్షకు పిలుపు



**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో, జనవరి 20న 'ఛలో ఇందిరాపార్క్ పోరు దీక్ష నిర్వహించనున్నట్లు నిరుద్యోగ కళాకారుల సంఘం సభ్యులు ప్రకటించారు.ఈ సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్రం ఏర్పడినా తమ జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఈ దీక్ష చేపడుతున్నామని తెలిపారు.పెద్దపల్లి జిల్లా ప్రెస్ క్లబ్‌లో కరపత్రం ఆవిష్కరించి, నిరుద్యోగ కళాకారులు భారీ సంఖ్యలో హాజరై దీక్ష విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావుకు వినతి పత్రం అందజేసి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష కార్యక్రమం



**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ భగత్‌నగర్‌లోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు.ముందుగా కొత్త జయపాల్‌రెడ్డి సోదరుడు కొత్త విజయ్‌కుమార్‌రెడ్డి అయ్యప్పస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం స్వాములకు స్వయంగా భిక్ష వడ్డించారు.ఈ సందర్భంగా పలువురు స్వాములు మాట్లాడుతూ కొత్త జయపాల్‌రెడ్డి సామాజిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సైతం తన వంతు సహకారం అందిస్తున్నారని కొనియాడారు. అయ్యప్పస్వాములు, హనుమాన్ దీక్షాపరులకు యేటా భిక్ష కార్యక్రమాలు నిర్వహించడం ఆయన విశిష్టత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్త జయపాల్‌రెడ్డి మిత్ర మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## సాగునీరు విడుదల చేయాలని డిమాండ్






**హుస్నాబాద్ నియోజకవర్గం, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సైదాపూర్ మండలానికి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ వెన్కేపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మునుపాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.గత వర్షాకాలంలో చిగురుమామిడి --సైదాపూర్ మండలాల పరిధిలో కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త కారణంగా నీటి ప్రవాహం అడ్డంకులకు గురైందని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలువల ద్వారా సకాలంలో సాగునీటిని అందించి రైతుల పంటలు ఎండిపోకుండా కాపాడిన ఘనత ఉందని గుర్తుచేశారు.కాలువ నీటిపై ఆధారపడి సైదాపూర్ రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను వెంటనే తొలగించి సాగునీటిని విడుదల చేయాలని, ఈ విషయంలో మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని మునుపాల శ్రీనివాస్ కోరారు.

## గురు తేజ్ మహారాజ్ షహీది దివస్ వేడుకలకు కవ్వంపల్లి హాజరు



**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిక్కు గురు తేజ్ బహదూర్ మహారాజ్ వీర మరణం 350వ సంవత్సరాన్ని పురస్కరించుకొని కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సిక్కు సోదరులు ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై సిక్కు మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్ కుమార్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం



**అమ్రాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం జనవరి 12న ఉదయం 10 గంటలకు అచ్చంపేటలోని టీఎన్జీవో భవనంలో జరగనుంది.ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల కోసం వెల్ఫేర్ అసోసియేషన్ బోర్డు ఏర్పాటు చేయడం. ఇంటి స్థలాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ అంశాలపై చర్చ జరగనుంది. ఉద్యమంలో పాల్గొన్న వారిని ఏడు మండలాల వారీగా స్పష్టమైన లిస్ట్ తయారు చేయాలని నిర్ణయించారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానం ఇవ్వకపోయినా, ఇదే అధికారిక ఆహ్వాన పత్రంగా భావించి అందరూ హాజరుకావాలని తెలంగాణ జేఏసీ మీడియా ఇన్చార్జి మహబూబ్ అలీ తెలిపారు.

## మినీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా మల్లు రవి



**అమ్రాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణంలో ముస్లిం మైనారిటీ మినీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమం జనవరి 12న ఉదయం 11 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ ఛైర్మన్ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ హాజరుకానున్నారు. శ్రీశైలం రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి అచ్చంపేట పరిసర ప్రాంత ముస్లిం మైనారిటీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ కమిటీ అచ్చంపేట పిలుపునిచ్చింది.

## ఘనంగా గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం



**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి గ్రామంలో శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చేరుకు మహేందరరెడ్డి--పద్మజా దంపతుల ఆధ్వర్యంలో, దాస్తగిరిపల్లి గ్రామానికి చెందిన మొగుసల ప్రశాంతి--మహేందరరెడ్డి దంపతుల చేత ఈ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు.కళ్యాణోత్సవం అనంతరం అన్నప్రసాదం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలందరికి విందు అందించారు. చిన్నలు, పెద్దలు, వృద్ధులు, ఊరి ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## సంక్రాంతి సందర్భంగా వీధి దీపాల ఏర్పాటు



**హుస్నాబాద్ నియోజకవర్గం, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నవాబుపేట గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు ప్రత్యేక చొరవతో జరిగింది. గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి అన్ని వార్డుల్లో, ప్రధాన రహదారులు, చౌరస్తాల వద్ద దీపాలను ఏర్పాటు చేశారు.గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యక్షంగా ఆరా తీసి వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కోమల్ల విజయ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో స్థానిక బీజేపీ నాయకుడు కోమల్ల విజయ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొలకాని నర్సయ్య, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, సౌత్ జోన్ ఇంచార్జ్ గుజ్జ శ్రీనివాస్, సౌత్ జోన్ మాజీ అధ్యక్షుడు పురం హరిశంకర్, 10వ డివిజన్ శక్తికేంద్ర ఇంచార్జ్ దాడి శంకర్ హాజరయ్యారు. డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ శిబిరం నిర్వహించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ముగింపు కార్యక్రమం




**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గాయత్రి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శీతాకాల శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గంట రమేష్, ఉపసర్పంచ్ కొండా శ్రావణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల అధినేత అల్లేంకి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక సేవ చేయడానికి ఎన్ఎస్ఎస్ ఒక వేదికగా నిలుస్తుందని, ఇందులో నేర్చుకున్న మంచి అలవాట్లు భవిష్యత్తులో సేవా దృక్పథంతో ముందుకు నడిపిస్తాయని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు. సర్పంచ్ గంట రమేష్ మాట్లాడుతూ గ్రామాన్ని శిబిరం కోసం ఎంచుకోవడం సంతోషకరమని, విద్యార్థులు అద్భుతంగా సేవ చేశారని అభినందించారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, గ్రామాధికారుల సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ విజేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఏ సమద్, అధ్యాపకురాలు ఆమని పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే లక్ష్యం



**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చొప్పదండి నియోజకవర్గం రెవెల్లి ప్రాంతం నుండి పెద్దపల్లి పెద్దాపూర్ చెరువులోకి వచ్చే కాకతీయ కాలువ మరమ్మతు పనులను రూ.25 లక్షల నిధులతో పరిశీలించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, అనంతరం డి-86 ఎస్కేప్ కెనాల్ కుంగిపోవడంతో అక్కడికి చేరుకొని నీటిపారుదల శాఖ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని, సాగునీటి విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, రైతన్నలకు ఎలాంటి వడ్ల కోతలు లేకుండా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. గత ప్రభుత్వం సాగునీటి విషయంలో విఫలమై రైతులకు అన్యాయం చేసిందని విమర్శించిన ఆయన, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత రైతు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వెలిజాల గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం



**కల్వకుర్తి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెలిజాల గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ పర్సన్ యాట గీత నరసింహ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తమ రాజకీయ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకోవడం కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవ రాజకీయానికి నిదర్శనమని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధతో పాటు ప్రజల పట్ల బాధ్యతను చాటుకుంటూ ముందుకు సాగుతున్న నాయకుల కార్యక్రమం గ్రామ ప్రజల మన్ననలు పొందింది.

# గర్షకుర్తి సరస్వతి హైస్కూల్‌కు గర్వకారణం



**గంగాధర, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామంలోని సరస్వతి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఐఎఫ్ఎస్ఓ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణమయ్యారు. 7వ తరగతి విద్యార్థిని సుహానా సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా, జూనియర్ విభాగంలో ఆయుష్మ, ఆరుషి, అద్విక్ వరుసగా 1వ, 2వ, 3వ స్థానాలు దక్కించుకున్నారు. విద్యార్థుల విజయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. ఈ విజయాలు పాఠశాల ప్రతిష్టను మరింత పెంచాయని స్థానికులు పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ భవనాన్ని శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న కొత్త గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇబ్బందులకు గురయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


# రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన జాతీయ నాయకులకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇది గౌరవం మాత్రమే కాకుండా దళితులకు సేవ చేసే గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. సీనియర్ వైద్యునిగా, నిబద్ధత కలిగిన నాయకునిగా తనను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఈ పదవిని ఇచ్చిందని అన్నారు. దళితుల హక్కుల కోసం కాంగ్రెస్ ఎప్పటి నుంచీ కృషి చేస్తోందని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి దళితులు కాంగ్రెస్‌కు అండగా ఉన్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో దళితులకు జరిగిన అన్యాయాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చి గౌరవం కల్పించిందని తెలిపారు. భట్టి విక్రమార్కను ఉప ముఖ్యమంత్రిగా, ప్రసాద్‌ను స్పీకర్‌గా నియమించడం దళితులకు ఇచ్చిన గౌరవానికి నిదర్శనమని అన్నారు. దళితులు ఏకమై 2029లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని, కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ ప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒడ్డె ఓబన్న పోరాట స్పూర్తి భావితరాలకు ఆదర్శం





**కరీంనగర్ / పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని రగిలించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న పోరాట స్పూర్తి భావితరాలకు ఆదర్శమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ అన్నారు. 219వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఓబన్న చేసిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ధైర్యసాహసాలు యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్డీఓ మహేశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ప్రముఖ యోధుడని, ఆయన కేవలం వడ్డెర కులానికి కాకుండా దేశ ప్రజల విముక్తి కోసం పోరాడారని గుర్తుచేశారు. జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.

# అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**గంగాధర, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం రంగారావుపల్లి సర్పంచ్ దాసరి శంకరయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, నాయకులు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సత్యం స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనుల కోసం రూ.3 కోట్లు మంజూరు



**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు గుజ్జుల కుమార్ స్వంత ఖర్చుతో నిర్మించిన కమాన్‌ను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీచర్స్ కాలనీలో రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, త్వరలో శంకుస్థాపనలు జరగనున్నాయని తెలిపారు. గతంలో రూ.53 లక్షలు కేటాయించగా, ఇప్పటివరకు మొత్తం రూ.3.54 కోట్ల నిధులు వెచ్చించామని చెప్పారు. పట్టణం దశలవారీగా సుందరంగా మారుతోందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ వాసులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తా

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెజ్జంకి మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల దేహ దారుఢ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెరుగుతాయని, గెలుపు కోసం వ్యూహాలు రచించే అలవాటు జీవితంలో ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు. యువత సెల్‌ఫోన్లలో సమయాన్ని వృథ చేయకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్లో క్రీడలపై మక్కువ పెంచేలా కృషి చేయాలని కోరారు. జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించిన ఆయన, యువకులు మంచి తర్ఫీదు పొంది రంజి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డా. కవ్వంపల్లి అనురాధ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# గన్నేరువరం మండలాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మార్చే కొత్త చొరవ



**గన్నేరువరం, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొత్త అడుగు వేశారు. కరీంనగర్ నుంచి మైలారం ఆలయం వరకు స్టీమర్ సేవలను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి నేతృత్వంలో మైలారం ఆలయ కమిటీ సభ్యులు ట్రయల్ రన్ నిర్వహించి విజయవంతం చేశారు. దారిలో చేపల వలలు లేదా ఇతర అడ్డంకులు లేవని నిర్ధారించారు. ఈ చొరవతో గన్నేరువరం మండల అభివృద్ధి, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మైలారం, మానసా దేవి, పార్వెల్ల దేవాలయాలకు ఆధ్యాత్మిక పర్యాటకుల రాకపోకలు మరింతగా పెరుగుతాయని సత్యనారాయణ తెలిపారు. త్వరలో స్వయంగా పర్యటించి స్టీమర్ సేవలను ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ ప్రమీలా సత్పతికి సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

# హుస్నాబాద్ టీచర్స్ కాలనీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**హుస్నాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సంక్రాంతి పండుగ సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ ఐలేని అనిత మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ అని, ఇల్లు ముందు ముగ్గులు వేస్తే అందంగా కనిపిస్తుందని అన్నారు. పోటీల్లో గెలుపు--ఓటములు సహజమని, ఓడినవారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని సూచించారు. చిన్న వయసులోనే మహిళలు ముగ్గులు వేయడం నేర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కాలనీవాసులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సావుల రవీందర్, ఆత్మలింగం, గోవిందు రవి, పూదరి సంపత్, మల్లేశం, తిరుపతి, లక్ష్మన్, వికాస్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ విజయానికి బూత్ కమిటీలే పునాదులు



**జగిత్యాల, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల జిల్లా కేంద్రంలో బూత్ నిర్మాణ అభియాన్ కార్యక్రమం జిల్లా కన్వీనర్ మద్రిపెల్లి సత్యమ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బూత్ కమిటీలే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే శక్తిగా నిలుస్తాయని అన్నారు. గతంలో ఛత్తీస్గఢ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో బూత్ కమిటీలు సంఘటితంగా పనిచేయడం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. అస్సాంలో ఒక్క వార్డు సభ్యుడు కూడా లేని స్థితి నుంచి హేమంత్ బిశ్వా నేతృత్వంలో బూత్ కమిటీలు బలపడటంతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఉదాహరణగా చెప్పారు. తెలంగాణలో కూడా బూత్ కమిటీలు పటిష్టంగా ఉన్నప్పుడే రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 36 వేల బూత్‌లలో 12 వేల బూత్‌లను గెలిచామని, మరో 6 వేల బూత్‌లలో రెండవ స్థానంలో నిలిచి ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని నిరూపించారని అన్నారు. గత ఇరవై సంవత్సరాలుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కో కన్వీనర్ సాంబారి కళావతి, కార్యదర్శులు తుకారాం గౌడ్, బెజ్జారపు లవణ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొక్కు గంగాధర్, ఆముద రాజు, మహిళా నాయకురాళ్లు భానుప్రియ, గడ్డల లక్ష్మి, మేకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనకు పిలుపు




**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా జీబు జాతర నిర్వహించి, 19వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా చేపడతామని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీలు ప్రకటించాయి. ముకుంద లాల్ మిశ్రా భవన్లో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కులను హరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్, విద్యుత్ సంస్కరణ బిల్లు, విత్తన సంస్కరణ చట్టం వంటి నిర్ణయాలు రైతాంగం, కార్మిక వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. గత 11 సంవత్సరాల్లో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చి, దేశ సంపదలో పెద్ద భాగాన్ని కొద్దిమంది కుటుంబాల చేతుల్లోకి బీజేపీ ప్రభుత్వం అప్పగించిందని ఆరోపించారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచకుండా, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ, విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ సాధారణ ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా జీబు జాతరలో పాల్గొని బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు వెలిమిరెడ్డి రాజిరెడ్డి, ఎం. వాసుదేవ రెడ్డి, అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, సుంకరి సంపత్, రాయకంటి శ్రీనివాస్, సి.హెచ్. రాములు, రమాదేవి, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం మహా పుణ్యకార్యం

**మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి**



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అన్నదానం మహా పుణ్యకార్యమని, ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చడమే అత్యున్నత సేవ అని మాజీ గవర్నర్, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ జి. చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్ బస్టాండ్ ఆవరణలో కీ.శే. బి. పార్వతమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ఆయన జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు కే. గోవర్ధన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు లేదా ఇతర శుభకార్యాల సందర్భంగా లయన్స్ క్లబ్ ద్వారా అన్నదాన కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. సేవా కార్యక్రమాలను నిబద్ధతతో నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కీ.శే. బి. పార్వతమ్మ స్మృతిగా ఆమె కుమారులు బిక్కుమాండ్ల వాసు, ప్రమోద్, రవి, రమేష్‌లు ఈ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, సుమారు 350 మందికి అన్నదానం అందించినట్లు క్లబ్ పీఆర్వో పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షుడు కే. గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా చైర్మన్లు కండే ఓంకారం, నటరాజ్ యాదయ్య, ఎం. అంజయ్య, కండె సత్యం,జూలూరి రమేష్, ఎం. చంద్రశేఖర్, ఉప్పుల రాములు, కొర్వి వెంకటయ్య, రామ్మోహన్, జూలూరి జయప్రకాష్, జూలూరి గోపాల్, జ్యోతి, వాసవి, మణి, బిక్కుమాండ్ల నరసింహతో పాటు పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వెలిచాల రాజేందర్ రావు నియామకంపై సంబరాలు





**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా వెలిచాల రాజేందర్ రావు నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తెలంగాణ చౌక్‌లో మాజీ కార్పొరేటర్ మీసా రమాదేవి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. జ్యోతి నగర్ కురుమవాడలో ఇరుమల్ల మల్లేశం ఆధ్వర్యంలో కూడా మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజేందర్ రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ కార్పొరేషన్‌లో మెజారిటీ సాధించి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చర్ల పద్మ, దన్న సింగ్, పోరండ్ల రమేష్, నాగుల సతీష్, చింతల కిషన్, మాజీద్ అలీ, కోడూరు రవీందర్ గౌడ్, వజీర్, మెతుకు కాంతయ్య, సిరికొండ శివప్రసాద్, లక్ష్మణ్ రాజు, ఎలగందుల మునీందర్, చర్ల పవన్, రాచమల్ల పద్మ, అనంతుల రమేష్, నీర్ల వసంత, అహమ్మద్, ఊకంటి రవీందర్ రెడ్డి, రూపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అక్బర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి



**షాద్ నగర్,జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని పోలీసు శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేసి ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు.కొంగరకలాన్ ఐడిఓసి కార్యాలయంలో ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా నియమితులైన సుధీర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో 50 శాతం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఖాళీలు ఉన్నాయని, వాటిని త్వరగా భర్తీ చేయాలని కోరారు.అలాగే నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీలను ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలన సౌలభ్యం పెరిగి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. గతంలో కొత్తూరు, నందిగామ మండలాలు శంషాబాద్ డివిజన్‌లో ఉండగా, మిగిలిన మండలాలు షాద్ నగర్ డివిజన్‌లో ఉండటం వల్ల పరిపాలనలో గందరగోళం ఏర్పడిందని గుర్తుచేశారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నియోజకవర్గ ప్రజలకు సౌకర్యవంతమైన పోలీసు సేవలు అందించేందుకు ఖాళీలను భర్తీ చేయడం, డివిజన్ పునర్వ్యవస్థీకరణ అత్యవసరమని స్పష్టం చేశారు

## బోడుప్పల్‌లో ఈ-వేస్ట్ సేకరణ ప్రత్యేక డ్రైవ్



**బోడుప్పల్, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బోడుప్పల్ విరారెడ్డి కాలనీలో ఆదివారం రోజున జిహెచ్‌ఎంసి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి, జనవరి 12, 13 తేదీల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ఈ-వేస్ట్ సేకరణ ప్రత్యేక కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వార్డు అధికారి జాడిగే శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, పనికిరాని పాత టెలివిజన్లు, కంప్యూటర్లు, వాషింగ్ మెషిన్లు, మొబైల్ ఫోన్ ఛార్జర్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను చెత్తలో వేయకుండా, కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన జిహెచ్‌ఎంసి సేకరణ కేంద్రానికి అందజేయాలని కోరారు.ఎలక్ట్రానిక్ వ్యర్థాలను స్వచ్ఛ భారత్ సిబ్బందికి అప్పగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**నల్లగొండ ,జనవరి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నల్లగొండకు చెందిన గీతా విజ్ఞాన ఉన్నత పాఠశాల 1989 90 పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. 35 సంవత్సరాల తర్వాత కలసిన నాటి విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వినోలియా, దీపిక, రాధిక, పద్మారాణి, సురేఖ దీపిక, నీత,, గీత, వింధ్య, నవీన,వివి నారాయణ, భరత్, వినయ్, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బజరంగ్ ప్రసాద్, మల్లికార్జున్, రాజు, సైదులు, సురేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణ కేంద్రంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ..సి పాయుల తిరుగుబాటుకు ముందే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు ఓబన్న. నరసింహారెడ్డి సైన్యానికి వెన్నుముకల నిలిచారని, ఆయన సాగించిన అలు పెరగని పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో వడ్డె రాజు, వరికుప్పల శ్రీనివాస్,నిరంజన్, జంగయ్య, రాజశేఖర్, శీను,నాగయ్య, జంగయ్య, శివశంకర్, రాజశేఖర్,శ్రీనివాస్, బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేని బీఆర్ఎస్ బీజెపీ ప్రభుత్వాలు



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నియోజకవర్గంలోని అభివృద్ధిని చూసి, మున్సిపల్ ఎన్నికలు రానున్న తరుణంలో ప్రజలు ఇప్పుడు గుర్తుకో చ్చారని ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మానయ్య అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏ నాడు ప్రజల సమస్యలను పట్టించుకోని టిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు మున్సిపల్ ఎన్నికల ముందు కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 15 వార్డులలో సీసీ, అండర్ డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటు కాంగ్రెస్ హయంలోనే ఆమనగల్లును అభివృద్ధి పథంలో నడిపిస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగన్, కృష్ణ నాయక్,ఖాదర్ ఖాద్రీ, అలీం, కాలే మల్లయ్య, ఎంగలి ప్రసాద్, మల్లేష్, పులికంటి మైసయ్య, సత్యం, నాసర్, కరీమ్,కండె సాయి,కుమార్ గౌడ్, వెంకటేష్, సాయి,గౌస్, శ్రీను, రమేష్, రాగ్య నాయక్, కృష్ణ, అంజత్ తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతలో ఆదర్శ దంపతుల అవార్డు ప్రధానం




**హైదరాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతలో ఆదివారం నిర్వహించిన ఆదర్శ దంపతుల అవార్డు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ కేంద్రమంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, ప్రముఖ పండితుడు దైవజ్ఞశర్మ హాజరై కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు.పర్యావరణ రంగంలో విశేష సేవలు అందించినందుకు డాక్టర్ చిరంజీవి -- శ్రీమతి హనీ ఫ్లోరెన్స్ దంపతులు ఆదర్శ దంపతుల అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ, ఇటీవల డాక్టరేట్ పొందిన సందర్భంలో ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని, సమాజానికి ఉన్నతమైన సేవలు అందించేందుకు ప్రేరణనిచ్చిందని తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తమ సంస్థ తరఫున పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో వైద్యరంగంలో చేసిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించిందని డాక్టర్ చిరంజీవి గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు, సాంస్కృతిక ప్రముఖులు, భక్తులు, దాతలు పాల్గొని దంపతులను అభినందించారు.

## సంక్రాంతి సందర్భంగా కరీంనగర్ పోలీసుల సూచనలు



**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంక్రాంతి సెలవుల్లో ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్ళడం వల్ల దొంగతనాలు పెరిగే అవకాశం ఉందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఇళ్లలో బంగారం, డబ్బు ఎక్కువగా ఉంచకుండా బ్యాంకు లాకర్‌లలో భద్రపరచాలని, సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు పెట్టకూడదని సూచించారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.పండుగ సమయంలో సైబర్ మోసాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అపరిచిత లింకులు ఓపెన్ చేయకూడదని, మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.ప్రజలు సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభమని, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 13న కరీంనగర్‌కు వెలిచాల రాజేందర్ రావు రాక



**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు ఈ నెల 13న మొట్టమొదటిసారిగా కరీంనగర్ రానున్నారు. అల్గునూరు చౌరస్తా వద్ద ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, అభిమానులు ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం భారీ ర్యాలీతో గీత భవన్ చౌరస్తా చేరుకుని అక్కడ జరిగే సంబురాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు డిసిసి కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్‌తో పాటు పలువురు నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. వెలిచాల ప్రజా కార్యాలయం అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

## క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

### టిపిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, జనవరి 11 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్) :**
రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని టిపిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండలం గడ్డమీది తండాలో ఆదివారం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, సర్పంచ్ చిట్టి రమేష్,ఉప సర్పంచ్ పంత్య నాయక్ లతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. టాస్ వేసి కొద్దిసేపు బ్యాటింగ్ పట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక ఒప్పందాలతో స్పోర్ట్స్ ఎకనామిక్ బలోపేతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణంలను ఏర్పాటు చేసి క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ. క్రీడాకారులను, క్రీడలకు అన్ని రకాల కోస్తా అని అందిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లక్షలాది మంది క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంక్రాంతికి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికి తీయడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దూదపడతాయని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాందాస్ నాయక్, హిరాసింగ్, తులసి రామ్, టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

# యువత క్రిడల్లో రాణించాలి

- కాంగ్రెస్ కిసాన్ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాలరాజ్



**కడ్తాల్, జనవరి 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**

యువత క్రిడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాలరాజ్ అన్నారు. కడ్తాల్ మండలం మండలం మక్తమాదారం గ్రామంలో ఆదివారం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఆడుతున్న యువతకు క్రీడా దుస్తులు బాలరాజ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణంలను ఏర్పాటు చేసి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లక్షలాది మంది క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంక్రాంతికి గ్రామంలో ఏర్పాటు చేసే క్రీడలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికి తీయడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దూదపడతాయని బాలరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, రాజేందర్, యాదయ్య,శబ్బు, ప్రేమాచారి క్రీడాకారులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**కడ్తాల్, జనవరి 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ముప్పై ఏళ్ల ఆనాటి విద్యార్థులు ఒక్క చోట చేరారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆడారు, పాడారు. ఆ నాటి మధుర స్మృతులను, చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబ సభ్యుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. 1996-97 బ్యాచ్ కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమావేశం మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించారు. అందరి చిరునామాలు సేకరించారు. డాన్సులు, ఆట పాటలతో సరదాగా గడిపారు. కష్ట సుఖాల్లో ఉన్న మిత్రులను ఆపద వేళ ఆదుకునేందుకు సహాయ నిధిని సమకూర్చేందుకు నిర్ణయించారు. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచీ మిత్రులు వచ్చారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. 30ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు కలుసుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. కుశల ప్రశ్నలు వేసుకొని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు శేఖర్ నేత, జయంధర్, రాములు, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, గురుమూర్తి, వెంకట్రామ్, యాదగిరి, సువర్ణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం పడమటితండాలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**మహేశ్వరం, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పడమటితండా గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ, గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరిగిందని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం గ్రామ యువత క్రీడల పట్ల చూపుతున్న ఆసక్తి శుభ పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. క్రీడలలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వినోద్ రాథోడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కే. లక్ష్మణ్, పి. భాస్కర్, కే. మోహన్, వి. శ్రీను, కే. బాబులాల్, అంబరు కే. బాబు పాల్గొని, విజేతలకు గుర్తుండిపోయేలా బహుమతులు అందజేస్తామని తెలిపారు.

# వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నారాయణ యాగం





--కుడారై ఉత్సవం



**వినోభా నగర్, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ నారాయణ యాగం, తిరుప్పావై సేవలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్నాయి. 26వ రోజు నారాయణ యాగం, కుడారై ఉత్సవం సందర్భంగా 108 కలశాలలో తయారు చేసిన పాయసం (కూడారై ప్రసాదం) స్వామివారికి నివేదించడం విశేషం. ఈ సందర్భంగా పండితులు ధనుర్మాసం, నారాయణ యాగం, కుడారై ఉత్సవం విశిష్టతను భక్తులకు వివరిస్తూ, సోమవారం జరగబోయే మహా పూర్ణాహుతిలో గత 26 రోజులుగా యాగంలో పాల్గొన్న దంపతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ధనుర్మాసంలో ప్రతిరోజూ నారాయణ యాగం జరుగుతుండగా, జనవరి 12న మహా పూర్ణాహుతి, జనవరి 13న నవకలశ స్నపన, గోదా రంగనాథ స్వామి ఎదురుకోళ్ల ఉత్సవం, జనవరి 14న గోదా రంగనాథ స్వామి కల్యాణం, వివాహం కాని వారి కోసం వారణమాయిారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది.

# మంత్రి నివాసంలో వికలాంగుల హక్కుల సాధన సమితి వినతి



**హైదరాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆదివారం నాడు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల నాయకులు, ఎస్సీ, ఎస్టీ మరియు వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని వారి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వారికి కావలసిన అవసరాలపై వినతిపత్రం సమర్పించారు. ఆసరా పింఛన్‌ను 6000 వరకు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు ఇవ్వాలని కోరారు. తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విద్యలో 10% రిజర్వేషన్, ప్రైవేటు కంపెనీల్లో 5% ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. మహారాష్ట్రలో దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 92 కింద ప్రత్యేక జి.ఓ. జారీ చేసినట్లే, తెలంగాణలో కూడా అలాంటి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జిల్లాల వారీగా దివ్యాంగుల సంక్షేమ శాఖలో స్వతంత్ర అధికారుల నియామకం అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు ప్రత్యేక వరాలు ప్రకటించినట్లే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా దివ్యాంగులకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో 5% రిజర్వేషన్ అమలు చేయాలని, దివ్యాంగుల చట్టం సలహా సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి అన్ని హక్కులు అమలు అయ్యేలా చూడాలని కోరారు. అన్ని శాఖల్లో 4% ఉద్యోగాల భర్తీ, ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్ వర్తింపజేయాలని మంత్రి గారికి రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, గౌరవ అధ్యక్షులు బండ జగన్, ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, అలాగే నాగరాజు, నరేష్, పాండు, రంజిత్, శివశంకర్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో సర్పంచులు, ఉపసర్పంచులకు ఘన సన్మానం

**ఎలిగేడు, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

సమాజానికి సేవ చేయడం దేవుడిచ్చిన వరమని, పూర్వజన్మ సుకృతమని భావిస్తూ నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు కట్ల సత్యనారాయణ మాట్లాడుతూ, పేద బలహీన వర్గాల గోసను అర్థం చేసుకొని పరిష్కారం చేస్తే జన్మ ధన్యం అవుతుందని, ప్రతి గ్రామంలో విద్య, వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు తగిన సాయం అందిస్తే ఊరు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ట్రస్ట్ సేవలను మరింత విస్తరించాలని, నిస్వార్థంగా సేవ చేస్తున్న నా నేస్తం ట్రస్ట్ అందరికీ ఆదర్శమని ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య, కవ్వంపల్లి బాపయ్య, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, మద్దెల రమాదేవి సంపత్, కళ్లెం వెంకటరెడ్డి, దుగ్యాల వాణి, గోపాల్ రావు రాధా, గంగ జమున, సిద్ధి తిరుపతి, గోపు రజిత, రంగులత శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపసర్పంచులు మారం రాయమల్లు, ఘోష్కి రవీందర్, పొన్నాల అనిల్, బైరి మల్లేశం, పుల్యాలమంగ, కొత్తిరెడ్డి బాపురెడ్డిలకు ట్రస్ట్ సభ్యులు శాలువాలు, బొకేలతో ఘన సన్మానం చేశారు. ఈ వేడుకలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షులు బూర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు తానిపర్తి సుధాకర్ రావు, అలాగే రంగు రాములు, తీట్ల రమేష్, అశోక్ మామిడి, డిలేశ్వర్ రెడ్డి, పల్లె వీరన్న, సత్యనారాయణ, గంప రాజశేఖర్, తీట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని ఎలిగేడు, సుల్తానాపూర్, దూళికట్ట, నర్సాపూర్, రాకలదేవ్ పల్లి, లాలపల్లి, నారాయణపల్లి, శివపల్లి, లోకపేట, ముప్పిరి, తోట రాములపల్లి, బురహాన్ మియాపేట గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





ఎలిగేడు మండలంలోని సర్పంచులను ఉపసర్పంచ్ లను సన్మానిస్తున్న నా నేస్తం చారిటేబుల్ ట్రస్ట్ సభ్యులు.

# నారా భువనేశ్వరి ప్రొఫెషనల్ అవార్డు అందుకోవడం హర్షనీయం

**టీడీపీ రాష్ట్ర నాయకులు అండేకార్ యాదిలాల్**



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : నారా భువనేశ్వరికి ప్రతిష్టాత్మకమైన అవుట్ స్టాండింగ్ డైరీ ప్రొఫెషనల్ అవార్డు లభించడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది అండేకార్ యాదిలాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి తగినట్లుగా ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి పాడి పరిశ్రమ అభివృద్ధినే లక్ష్యంగా హెరిటేజ్ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పాడి పరిశ్రమను ఆధునీకీకరించి రైతులకు స్థిర ఆదాయం కల్పించాలనే దృఢ సంకల్పంతో భువనేశ్వరి చేస్తున్న కృషిని గుర్తించిన ఇండియన్ డైరీ అసోసియేషన్ సౌత్ జోన్ ఆమెకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేయడం గర్వకారణమని యాదిలాల్ తెలిపారు. హెరిటేజ్ సంస్థ అనేది కేవలం వ్యాపార పరమైన సంస్థ మాత్రమే కాదని, పాడి రంగం అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తూ రైతులను ప్రోత్సహించే సామాజిక బాధ్యత గల సంస్థగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా పాలు కొనుగోలు చేసిన రైతులకు హెరిటేజ్ సంస్థ ద్వారా రూ. 78 లక్షలు చెల్లించిన విషయం ఇందుకు నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. రైతు సంక్షేమం, గ్రామీణ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయత్నాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# స్వచ్ఛతకు.. తూట్లు!



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పచ్చదనం-పరిశుభ్రత లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు, ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ, వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పురపాలికగా ఆమనగల్లు ఏర్పాటైన తర్వాత మౌలిక వసతులు మెరుగుపడతాయని, పట్టణం అభివృద్ధి దారిలో వేగంగా ముందుకుసాగుతుందని ప్రజలు ఆశించారు. అయితే ఆ ఆశలు ఇప్పటివరకు నెరవేరలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు పురపాలిక పరిధిలోని 15 వార్డుల్లో అభివృద్ధి పనులు సమగ్రంగా జరగకపోవడంతో పాటు, అంతర్గత వీధులు, పట్టణ శివారు కాలనీల్లో సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉండటం, మురుగు నీటి పారుదల వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వర్షకాలంలో మరింత తీవ్రతరం అవుతున్న ఈ సమస్యలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. కనీస పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనపై పురపాలక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మాటల్లోనే కాకుండా కార్యాచరణలోనూ స్వచ్ఛత--అభివృద్ధి కనిపించాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మహేశ్వరం నియోజకవర్గ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్ చేసేందుకు కృషి - కేఎల్ఆర్



**తుక్కుగూడ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మాట్లాడుతూ, జిహెచ్ఎంసిలో విలీనం చేసిన నాదర్‌గుల్, బడంగ్‌పేట, బాలాపూర్ డివిజన్లను హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలో డివిజన్ల వారీగా పార్టీ పదవులను భర్తీ చేయనున్న నేపథ్యంలో, నాదర్‌గుల్, బడంగ్‌పేట డివిజన్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల నేతలు కేఎల్ఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పార్టీ పదవుల్లో సామాజిక సమీకరణ, సీనియార్టీ, పనికి చేసే నాయకులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో యువజన కాంగ్రెస్‌కు అవకాశం కల్పించాలని మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేఎల్ఆర్, టీపీసీసీ సహా పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాత బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో మూడు డివిజన్లలో పార్టీ పదవులు భర్తీ చేసిన తర్వాత జిహెచ్ఎంసి ఎన్నికలపై దృష్టి పెట్టాలని నేతలను కేఎల్ఆర్ కోరారు. మహేశ్వరం నియోజకవర్గం సహా పక్క నియోజకవర్గాల డివిజన్లను కలుపుతూ ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో నాదర్‌గుల్, బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, బాలాపూర్ గ్రామాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వైభవంగ సంక్రాంతి ముగ్గుల పోటీలు







**నల్లగొండ ,జనవరి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సంక్రాంతి పండగ సందర్బంగా కనగల్ మండలం దోరపల్లి గ్రామంలో ఆదివారం మహిళలు ఀ యువతుల సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కనగల్ ఎంపీడీఓ ఎ.వేద రక్షిత విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు ఈ ముగ్గుల పోటీలలో సుంకిరెడ్డి అనుష ప్రథమ బహుమతి బైరగోని నిరోష ద్వితీయ బహుమతి కిన్నెర పారిజాత తృతీయ బహుమతులు అందుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ , కార్యదర్శి గణేష్ , వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం ముగ్గుల పోటీకి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎంపీడీఓ ని గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ సన్మానించారు.

# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**పెద్దపల్లి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్రాంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గీతాంజలి పబ్లిక్ స్కూల్లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను, సంస్కృతిని ప్రతిబింబించేలా రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష మాట్లాడుతూ పోటీలో గెలవడం కంటే పాల్గొనడమే గొప్ప విజయమని అన్నారు. సంక్రాంతి పండుగ కేవలం ఆనందం మాత్రమే కాకుండా సంప్రదాయాలు, మహిళల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి స్రవంతికి ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్, రెండవ బహుమతి ఐశ్వర్యకు మిక్సీ జార్, మూడవ బహుమతి గాయత్రికి ప్రెషర్ కుక్కర్ ఇవ్వడం జరిగింది. కార్యక్రమానికి గీతాంజలి స్కూల్స్ కరస్పాండెంట్ రేపాల రజిత, బీసీ జేఏసీ నాయకులు స్వప్న, శారద, కోండి సతీష్, శంకర్, రాజేందర్, అరుణ, నవ్య, శ్రీధర్, రవీందర్ తదితరులు హాజరయ్యారు.

# ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో బహుమతుల విజేతలకు ప్రధానం



**అమ్రాబాద్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల అచ్చంపేట ప్రాంతం నుండి జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అచ్చంపేట రాజీవ్--ఎన్టీఆర్ స్టేడియాన్ని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. త్వరలోనే అచ్చంపేటలో ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం జరగనుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రామనాథం, కౌన్సిలర్ చింతల రాజగోపాల్, శివ, ఎస్సై సద్దాం, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, స్పాన్సర్లు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

# తపస్‌లో చేరిన తెలంగాణ పిఆర్టియు రంగారెడ్డి జిల్లా బాధ్యులు









**కరీంనగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కపల్లి పెంటయ్య సమక్షంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ బాధ్యులు తపస్ సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో తపస్ మాజీ అధ్యక్షుడు కనుగంటి హనుమంతరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశిరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్, జిల్లా బాధ్యులు కాలే శ్రీశైలం ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పిఆర్టియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రాజి రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు జె. కరుణాకర్ రెడ్డి, మండల బాధ్యులు జె. కరుణాకర్ రెడ్డి, పట్నం కృష్ణ, అదృష్ట రావు, మేడ్చల్ జిల్లా బాధ్యులు అచ్చన మల్లేష్ తదితరులు తపస్‌లో చేరారు. తపస్‌లో చేరిన కొత్త బాధ్యులు సంఘ అభివృద్ధి కోసం, విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

## అగర్ మియాగూడ సర్పంచ్ స్వప్న శ్రీనివాస్‌కు శ్రీరాములు ఘన సన్మానం





**సరూర్‌నగర్, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని అగర్ మియాగూడ గ్రామ సర్పంచ్ బెల్లి స్వప్న శ్రీనివాస్ యాదవ్ ఇటీవల ఎన్నికైన సందర్భంగా, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములును కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు, సర్పంచ్ స్వప్న శ్రీనివాస్‌తో పాటు వారి పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. అగర్ మియాగూడ గ్రామ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని శ్రీరాములు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ శాఖ బిజెపి నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని సర్పంచ్‌ను అభినందించారు.

## రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా జెన్నపల్లి పద్మకృష్ణ




**రంగారెడ్డి, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మాణిక్యమ్మగూడ గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణను జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో జిల్లా సర్పంచుల సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా పద్మకృష్ణ మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, సర్పంచుల సంఘం నాయకులు మందిపల్ వెంకట్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ గుప్తాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా లక్నాపురం శివశంకర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా మాధవి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఈ. రవి, జె. పద్మకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులుగా గొటికే గోపాల్ రెడ్డి, జక్క రవీందర్ రెడ్డి, బొప్పిడి గోపాల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మూడవత్ శ్రీను బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సర్పంచులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ, సమాజాభివృద్ధి కోసం కృషి చేస్తానని జెన్నపల్లి పద్మకృష్ణ హామీ ఇచ్చారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ఆమనగల్లు, జనవరి 11(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ పంచాయతీలో శాశ్వత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేడిగడ్డ సర్పంచి రాజేశ్వరి, ఉప సర్పంచి విజయరాథోడ్ తెలిపారు. ఆదివారం మేడిగడ్డ గ్రామంలో పాడైన అండర్ డ్రైనేజీ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, డ్రైనేజీ సమస్య లేకుండా చూస్తామన్నారు. మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేసి, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీలను నిర్మిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేష్, విజయ్, శీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ యువ దినోత్సవం యువశక్తికి ప్రేరణ



ప్రతి సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ యువ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావం, కర్తవ్యనిష్ఠను పెంపొందించడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. 1863లో కోల్‌కతాలో జన్మించిన నరేంద్రనాథ్ దత్తు, తరువాత స్వామి వివేకానందగా ప్రపంచానికి పరిచయమయ్యారు. రామకృష్ణ పరమహంస శిష్యత్వంలో ఆధ్యాత్మిక జ్ఞానం, మానవ సేవే పరమధర్మమని తెలుసుకున్నారు. 1893లో అమెరికాలో జరిగిన ప్రపంచ ధర్మ సభలో “సిస్టర్స్ అండ్ బ్రదర్స్ అఫ్ అమెరికా” అంటూ చేసిన ప్రసంగం ఆయనను ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందేలా చేసింది. “లేచి నిలబడండి, మేల్కొనండి, లక్ష్యం సాధించే వరకు ఆగకండి” అనే ఆయన సందేశం నేటికీ కోట్లాది యువతకు స్ఫూర్తినిస్తోంది. మానవ సేవే దైవ సేవ, బలహీనతే పాపం, బలం జీవితానికి ఆభరణం అని ఆయన బోధించారు. 1984లో భారత ప్రభుత్వం ఆయన జయంతిని జాతీయ యువ దినోత్సవంగా ప్రకటించింది. 1985 నుండి అధికారికంగా ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. విద్య, క్రమశిక్షణ, ధైర్యం, సేవా భావం కలిగిన యువతతోనే బలమైన భారతదేశం నిర్మించవచ్చని ఆయన విశ్వసించారు. రామకృష్ణ మిషన్ ద్వారా ఆయన ఆలోచనలు నేటికీ విద్య, వైద్యం, సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగుతున్నాయి. యువత జాగృతమైతే దేశం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని వివేకానంద ఆశయాలు గుర్తు చేస్తున్నాయి.





# తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



**దేవరకొండ జనవరి 11.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రంథలయంలోరాష్ట్ర వ్యవస్థాపకులు జేబి రాజు రాష్ట్ర అధ్యక్షులు చిప్పలపల్లి అవిలయ్య ఆదేశానుసారం మేరకుతెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు అధ్యక్షతన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారుఈ కార్యక్రమానికినల్గొండ జిల్లా అధ్యక్షులు కొండేటి వెంకట్ హాజరైనారు. ముఖ్య అతిథిగా దేవరకొండ మండలం సర్పంచుల పోరం మండల అధ్యక్షులు గిరిజన ముద్దుబిడ్డ యువ నాయకులు కోర్ర రామ్ సింగ్ నాయక్ ,సాంఘిక సంక్షేమ డిండి వార్డెన్ సాటు నాగరాజురిటైర్మెంట్ ఉపాధ్యాయులు నిరసనమెట్లసుందరయ్య ,మిర్యాలగూడ మాజీ కౌన్సిలర్ యేకుల లక్ష్మీ అమృతం,రిటైర్మెంట్ ఉపాధ్యాయులు అడ్వకేట్ మద్దిమడుగు రామస్వామి ఉపాధ్యాయులు చాట్ల ఇద్దయ్య ముడీ అంజయ్య మాట్లాడుతూ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల మేరకు పనిచేయాలని ఉన్నత చదువులు చదివి అత్యున్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు.రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాలు మరియు దళిత గిరిజన మైనార్టీ అగ్రవర్ణ పేదలు అభివృద్ధి చెందాలని భారత రాజ్యాంగ పీఠికను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని భారత రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు సమానత్వం రిజర్వేషన్లు ప్రతి మనిషి జీవించే హక్కు భారత రాజ్యాంగం పొందుపరిచిందని మహిళా హక్కులను మహిళా రిజర్వేషన్లను ఓటు హక్కును భారత రాజ్యాంగం ద్వారా ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పొందుపరిచారని విద్యార్థులు చదువులో చక్కగా రాణించి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని బడుగు బలహీన అట్టడుగు వర్గాల ప్రజలు రాజ్యాధికారం సాధించి ఆత్మగౌరవంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గం సెక్రటరీ సుక్కముత్తయ్య, దేవరకొండ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మరియు డిండి గుండ్లపల్లి మండల అధ్యక్షులు పేరుమల్ల అనిల్ కుమార్ ,చందంపేట మండల అధ్యక్షులు నాగిళ్ల వెంకటయ్య, పీఏ పల్లి ఉమ్మడి మండల అధ్యక్షులు యర్ర వంశీ ,పీఏ పల్లి మండలం అధ్యక్షులు దున్న ముత్యాలు ,గుడిపల్లి మండల అధ్యక్షులు బోడ నాగరాజు ,దేవరకొండ మండల అధ్యక్షులు కృష్ణ ,కొండ మల్లేపల్లి మండల అధ్యక్షులు వంగూరి శ్రీను ,మైనంపల్లి గ్రామ వార్డు మెంబర్ పులిజాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతి ని కలిసిన మ్యూజిక్ డైరెక్టర్ వెంగీ.



**ఎలిగేడు, జనవరి 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన సినీ మ్యూజిక్ డైరెక్టర్ సుధాకర్ వెంగీ ఆదివారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుని మర్యాదపూర్వకముగా కలిసారు. స్వర్ణ భారతి ట్రస్ట్ ముచ్చింతల్లో జరిగే సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు ఇటీవల తనపై రాసిన ఆచ్చ తెలుగు అజానుబావుడు మన వెంకయ్య నాయుడు అనే పాట చాలా బాగుందని ఆయన కుటుంబ సభ్యులతో ఆ పాట విని చాలా ఆనందించానని వారన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ ను అభినందించి రాబోయే రోజుల్లో మరిన్ని పాటలు రాయాలని ఆకాంక్షించారు.

## శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం పునరుద్ధరణకు ప్రజల విజ్ఞప్తి



**వెల్దండ, జనవరి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడం స్థానిక ప్రజలను కలచివేస్తోంది. ఈ పురాతన దేవాలయాన్ని పునరుద్ధరించి, మండల ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎండోమెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి దేవాలయ పునర్నిర్మాణంపై చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జంగిలి నిరంజన్, మాల మహానాడు నాయకులు జంగిలి యాదగిరి, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, నాలుగో వార్డ్ మెంబర్ జంగిలి సునీత ఆనంద్, అలాగే జంగిలి బాబు, రఘు, కూన కృష్ణయ్య, జంగిలి కిష్టయ్య, సిరిసనగండ్ల శీను, గోరేటి భారత్, డేవిడ్, ప్రవీణ్, కన పాండు, జగ్గు, గోరేటి బొందయ్య, గోరేటి సంజీవ, జంగిలి కొండల్, జంగిలి రవి, జంగిలి తిరుపతయ్య, జంగిలి ప్రసాద్, గోరేటి కృపానందం, పెద్ద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ప్రగ్యా జైస్వాల్!




# ఆసక్తికరంగా 'ద్రౌపది 2' ట్రైలర్.. జనవరి 23న గ్రాండ్ రిలీజ్!

వివాదాస్పద చిత్రాల దర్శకుడు మోహన్ జి దర్శకత్వంలో తెరకెక్కిన 'ద్రౌపది' సీక్వెల్ 'ద్రౌపది 2' ట్రైలర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. భారీ అంచనాల మధ్య శనివారం రాత్రి విడుదలైన ఈ ట్రైలర్, నెటిజన్ల మధ్య పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. తొలి భాగం సమకాలీన సామాజిక అంశాల చుట్టూ తిరగగా, ఈ సీక్వెల్ 14వ శతాబ్దపు హోయసల సామ్రాజ్య కాలం నాటి పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కింది. ట్రైలర్‌లో చూపిన కొన్ని చారిత్రక ఘర్షణలు, డైలాగులు ఇప్పటికే హాట్ టాపిక్‌గా మారాయి. ఈ చిత్రంలో హీరోగా నటించిన రిచర్డ్ రిషి మరోసారి పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. కథనాయికగా నటించిన రక్షణ ఇందుచూడన్ తన నటనతో ఆకట్టుకోనుంది. మహ్మద్ బిన్ తుగ్లక్ పాత్రలో చిరాగ్ జానీ కనిపించబోతున్నారు. స్టార్ కంపోజర్ జిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఇందులోని 'నెలరాజే', 'తారాసుకి' పాటలు ఇప్పటికే చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఈ చిత్రం జనవరి 23, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అయితే సంక్రాంతి సీజన్ దృష్ట్యా, అంతకంటే ముందే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో కూడా మేకర్స్ ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్.

# సోషల్ మీడియాలో హీట్ పెంచుతున్న నేహా శెట్టి

డీజే టిల్లు చిత్రంలో రాధిక పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి నేహా శెట్టి, ప్రస్తుతం వెండితెరపై తన మునుపటి జోరును కొనసాగించలేకపోతున్నారు. సినీ అవకాశాలు తగ్గుముఖం పట్టినప్పటికీ, ఆమె సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో నిరంతరం అప్డేట్‌లను పంచుకుంటూ ట్రెండింగ్‌లో నిలబడేందుకు కృషి చేస్తున్నారు.









# సంక్రాంతి బరిలో కార్తీ.. జనవరి 14న 'వా వాతియార్' గ్రాండ్ రిలీజ్!

కోలీవుడ్ నటుడు కార్తీ, దర్శకుడు నలన్ కుమారస్వామి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'వా వాతియార్'. గత కొంతకాలంగా విడుదల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం, ఎట్టకేలకు సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిజానికి ఈ సినిమా గత ఏడాది డిసెంబర్ 12న విడుదల కావాల్సి ఉంది. అయితే నిర్మాత జ్ఞానవేల్ రాజాకు సంబంధించిన పాత బాకీల విషయంలో తలెత్తిన న్యాయపరమైన చిక్కులు ఆర్థిక సమస్యల వల్ల సినిమా విడుదల నిలిచిపోయింది. తాజాగా ఆ సమస్యలన్నీ పరిష్కారం కావడంతో 'స్టూడియో గ్రీన్' సంస్థ పండగ రేసులోకి ఈ చిత్రాన్ని తీసుకొచ్చింది. తమిళంలో 'వా వాతియార్' పేరుతో వస్తున్న ఈ చిత్రం, తెలుగులో 'అన్నగారు వస్తారు' అనే టైటిల్‌తో విడుదల కానుంది. అయితే, ప్రస్తుతం సంక్రాంతికి తెలుగులో పెద్ద సినిమాలు ఉండటంతో, తెలుగు వెర్షన్ విడుదల తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. బహుశా తమిళంతో పాటే లేదా కొన్ని రోజుల గ్యాప్‌తో తెలుగులో విడుదలయ్యే అవకాశం ఉంది. కార్తీ సరసన కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందించారు. ఇది ఒక మాస్ యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్. ఇందులో కార్తీ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.

# ఓటీటీలోకి మమ్ముట్టి క్రైమ్ థ్రిల్లర్ 'కలంకావల్'..

## స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ "కలంకావల్" డిజిటల్ ఎంట్రీకి సిద్ధమైంది. థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ సోని లివ్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా.. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం జనవరి 16 నుంచి మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో మమ్ముట్టి గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక విలక్షణమైన సైకో పాత్రలో కనిపించబోతున్నారు. మమ్ముట్టితో పాటు వర్సటైల్ యాక్టర్ వినాయకన్ కీలక పాత్రలో నటించారు. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. జితిన్ కె జోస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని మమ్ముట్టి స్వయంగా తన సొంత నిర్మాణ సంస్థ 'మమ్ముట్టి కంపెనీ'పై నిర్మించారు. వేఫరర్ ఫిల్మ్స్ మరియు ట్రూత్ గ్లోబల్ ఫిల్మ్స్ భాగస్వామ్యంతో ఈ భారీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది.